సాక్షి
కర్నూలు
మంగళవారం ၊ 13 ၊ మే ၊ 2025



మహానందిలో భక్తుల సందడి

మహానంది: వేసవి సెలవుల నేపథ్యంలో మహానంది క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. కోనేరుల్లో స్నానాలు చేసి శ్రీ కామేశ్వరీ దేవి సహిత మహానందీశ్వర స్వామిని దర్శించుకున్నారు.



విద్యార్థులకు తప్పిన ముప్పు

రైల్వే గేటును ఢీకొని పట్టాల పైకి వచ్చి కారు ఆగింది. గేట్‌మెన్ అప్రమత్తం కావడంతో రైలు ఆగి పోయింది. మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ప్రమాదం తప్పింది. 8లో▸



సబ్సిడీ తగ్గి.. ధర పెరిగి!

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఖరీఫ్ సీజన్‌కు ఆరకొరగా వేరుశనగ విత్తనాలు కేటాయించింది. సబ్సిడీ తగ్గించడంపై విమర్శలకు దారి తీసింది. ధర ఎక్కువగా ఉండటంపై రైతులు పెదవి విరిచారు. 8లో▸

న్యూస్‌రీల్

67 మందికి గ్రేడ్-2 కార్యదర్శులుగా పదోన్నతి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 67 మంది గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-2 కార్యదర్శులుగా పదోన్నతి లభించినట్లు జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో 31 మందికి, నంద్యాల జిల్లాలో 36 మందికి పదోన్నతి లభించిందన్నారు. వీరిలో కర్నూలు జిల్లాకు 10 మందిని, నంద్యాల జిల్లాకు 10 మందిని కేటాయించి మిగిలిన వారిని ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాలకు కేటాయిస్తు సీపీఆర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఉమ్మడి జిల్లాలో గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి పొందేందుకు 34 మంది జూనియర్ అసిస్టెంట్లకు అర్హత ఉందన్నారు. ఈ మేరకు అనుమతి కోరుతున్నామని డీపీఓ వెల్లడించారు.

17న పాణ్యంకు సీఎం రాక

పాణ్యం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈనెల 17వ తేదీన పాణ్యం రానున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే 'స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి హాజరు కానున్నారు. సీఎం పర్యటన ఏర్పాట్లపై సోమవారం నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ మండల రెవెన్యూ అధికారులతో సమీక్ష చేపట్టారు. సీఎం పర్యటన షెడ్యూల్ అధికారకంగా రావడంతో ఆర్డీఓ, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి కలిసి హెలిపాడ్ స్థలాన్ని పరిశీలించారు. పాణ్యం హైవేలోని చందమామ హోటల్ ఎదురుగా ఉన్న ప్రైవేట్ వెంచర్‌ను పరిశీలించారు. మరో స్థలాన్ని పరిశీలించనున్నారు. పాణ్యం ప్రభుత్వ పాఠశాలలో బహిరంగ సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు గురించి ఆర్డీఓ అడిగి తెలుసుకున్నారు. అధికారికంగా సీఎం పర్యటన ఖరారైనట్లు ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మైనారిటీ రుణాల దరఖాస్తుకు 25న ఆఖరు



సబీహా పర్వీన్, ఈడీ, మైనారిటీ కార్పొరేషన్

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మైనారిటీ, క్రిష్టియన్ వర్గాల ప్రజలు సబ్సిడీ రుణాలకు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ కార్పొరేషన్ ఈడీ ఎస్.సబీహా పర్వీన్ తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మైనారిటీ వర్గాలకు చెందిన వారికి రూ.లక్ష నుంచి రూ.8 లక్షల వరకు, క్రిష్టియన్ మైనారిటీ వర్గాలకు చెందిన వారికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రుణాలను అందిస్తామన్నారు. దరఖాస్తు చేసుకొని ఎంపికైన వారికి 50 శాతం సబ్సిడీ మంజూరవుతుందన్నారు. అర్హత కలిగిన వ్యక్తులు తమ వివరాలను httpr://apbommr.apcfrr.in వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఈడీ, మైనారిటీ కార్పొరేషన్ కార్యాలయంలో, లేదా 9848864449, 9440822219 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

దొర్నిపాడులో 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత

కర్నూలు(అగ్రికల్చర్): భానుడి భగభగలు పెరిగాయి. కొద్ది రోజులుగా 40 డిగ్రీల వరకు నమోదవుతున్న ఉష్ణోగ్రతలు సోమవారం పెరిగి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. దొర్నిపాడులో 41.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పాణ్యంలో 40.5, రుద్రవరంలో 40.2, శిరువెళ్లలో 40, గూడూరులో 39.3, కోడుమూరులో 39.2, వెల్దుర్తిలో 39.1 డిగ్రీల ప్రకారం నమోదయ్యాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు జిల్లా విపత్తుల నిర్వహణ అథారిటీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అనుపమ తెలిపారు.

పడిపోయిన మిర్చి ధర

- క్వింటా ధర రూ.8వేలు మించని వైనం

కర్నూలు(అగ్రికల్చర్): మిర్చి ధరలు మరింత పడిపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రస్తుతం ఉన్న ధరతో అమ్ముకుంటే పెట్టిన పెట్టుబడిలో 50 శాతం కూడా దక్కదనే ఉద్దేశంతో ఏసీ గోదాముల్లో నిల్వ చేసుకుంటున్నారు. 2022, 2023 సంవత్సరాల్లో మిర్చి సాగు చేసి లాభాల పంట పండించుకున్న రైతులు 2024లో కోలుకోలేని విధంగా నష్టపోయారు. మిర్చి రైతులను ఆదుకుంటామని మూడు నెలల క్రితం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హడావుడి చేసినా ఆ దిశగా చర్యలు లేకపోవడం గమనార్హం. 2024 ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో 95,478 ఎకరాలు, నంద్యాల జిల్లాలో 22,390 ఎకరాల్లో మిర్చి సాగయింది. చీడపీడల సమస్యలు పెరగడంతో ఎకరాకు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టారు. దిగుబడులు కూడా పడిపోయాయి. ఇదే సమయంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి ధరలు మరింత పడిపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. 2022లో మిర్చి ధర రికార్డు స్థాయిలో రూ.53 వేలకు పైగా పలికింది. 2023లో రూ.30 వేల ధర లభించింది. తాజాగా ఎరువు రకం ధర క్వింటాకు కనిష్టంగా రూ.2,299, గరిష్టంగా రూ.8,259 , సగటు ధర రూ.5,669 నమోదైంది. తేజా రకం ధర రూ.7,293 పలికింది.

రికవరీ మాయం

ఉద్యోగులు తలుచుకుంటే ఏమైనా చేయగలరనేందుకు సబ్సిడీ రుణాలే నిదర్శనం. అర్హులు రుణాలు అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే.. అడ్డదారిలో రుణాలు దక్కించుకున్న వాళ్లు ఎంచక్కా షి'కారు' చేస్తున్నారు. అంతేకాదు.. ఉద్యోగులను బుట్టలో వేసుకొని రుణాలు తిరిగి చెల్లించకుండా చేసుకుంటున్న తీరు ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రభుత్వ కార్యాలయంలో రుణాలకు సంబంధించిన ఫైల్ మాయమైన ఘటన ఉద్యోగుల చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోంది. ఈ కారణంగా రికవరీ ఎలా చేయాలో తెలియక తలలు పట్టుకోవడం అధికారుల వంతయింది.

ఇన్నోవా కారు: రూ.16,58,300లకు కొనుగోలు చేశారు. ఇందులో ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ లోన్ రూ.9,94,980 కాగా, ట్రికార్ సబ్సిడీ రూ.5,80,405లుగా నిర్ణయించారు. అలాగే లబ్ధిదారుని వాటా రూ.82,915 చెల్లించిన వారికి వాహనాలు కేటాయించారు.

బొలెరో వాహనం: రూ.10.60 లక్షలకు కొనుగోలు చేశారు. ఇందులో ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ లోన్ రూ.6.36 లక్షలు, సబ్సిడీ రూ.3.71 లక్షలు కాగా.. లబ్ధిదారుని వాటా రూ.53 వేలు చెల్లించిన వారికి బొలెరో వాహనాలను అందించారు.

ట్రాక్టర్ కమ్ ట్రాలీ: రూ.10 లక్షలకు కొనుగోలు చేశారు. ఇందులో లోన్ రూ.6 లక్షలు కాగా, సబ్సిడీ రూ.3.50 లక్షలు. లబ్ధిదారుని వాటా రూ.50 వేలు చెల్లించిన వారికి ట్రాక్టర్లు మంజూరైంది.



ఇన్నోవా కారు

రెడిమేడ్ గార్మెంట్ యూనిట్

యూనిట్ ఏర్పాటుకు రూ.10 లక్షలను మంజూరు చేశారు. ఇందులో లోన్ 8.50 లక్షలు, సబ్సిడీ రూ.లక్ష. లబ్ధిదారుని వాటా రూ.50 వేలు చెల్లించిన వారికి రుణం మంజూరు చేశారు.

గిరిజన సంక్షేమ శాఖలో రుణాల ఫైల్ గల్లంతు

- 2018–19లో 11 మందికి రూ.1.57 కోట్ల రుణాలు
- ఇందులో 7 ఇన్నోవా, 2 బొలేరో వాహనాలు
- కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన రుణం రూ.96.86 లక్షలు
- ఇప్పటి వరకు చెల్లించింది రూ.10.45 లక్షలు
- రికవరీ తక్కువగా ఉందని ఉన్నతాధికారుల అసహనం
- షూరిటీ ఇచ్చిన వారికి నోటీసులు పంపేందుకు కనిపించని ఫైల్



జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయం

ఫైల్‌పై ఆరా తీస్తున్నాం



ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ రుణాలకు సంబంధించిన ఫైల్ కనిపించకుండా పోయిన విషయంపై ఆరా తీస్తున్నాం. ఎవరైనా కావాలని ఫైలును మాయం చేశారా? లేక కార్యాలయంలోనే ఎక్కడైనా మిస్ అయ్యిందా? అనే కోణంలో విచారణ చేయిస్తున్నాం. అప్పట్లో కార్యాలయంలో విధులు నిర్వహించిన ఉద్యోగులు ఫైల్‌ను తమ ప్లేస్‌లోకి వచ్చిన వారికి అప్పగించారా, లేదా అనే విషయాలను కూడా తెలుసుకుంటున్నాం. ఫైల్ కనిపించకుండా పోవడం వల్ల ఈ పథకం కింద తీసుకున్న రుణాల రికవరీ కష్టతరమవుతోంది. – కె.తులసీదేవి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారిణి

కర్నూలు(అర్బన్): జిల్లా గిరిజన సంక్షేమ శాఖలో రూ.1.57 కోట్ల విలువైన ఫైల్ మాయమైన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 2017–18, 2018–19 ఆర్థిక సంవత్సరంలో నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ) పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో అర్హులైన 11 మంది గిరిజన అభ్యర్థులకు సబ్సిడీతో కూడిన రుణాలను మంజూరు చేశారు. ఇందులో ఏడుగురికి ఇన్నోవా, ఇద్దరికి బొలేరో వాహనాలు, ఒకరికి ట్రాక్టర్, మరొకరికి రెడిమేడ్ గార్మెంట్స్ యూనిట్ కోసం రుణం మంజూరైంది. ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ పథకంలో భాగంగా 11 మందికి అప్పట్లో రూ.1.57 కోట్ల రుణాలను అందించగా, ఇప్పటి వరకు కేవలం రూ.10.45 లక్షలు మాత్రమే రికవరీ అయినట్లు తెలుస్తోంది. సబ్సిడీ రూ.52.54 లక్షలు పోయినా, ఇంకా 8 శాతం వడ్డీతో కలిపి రూ.1.04 కోట్లను కార్పొరేషన్‌కు జమ చేయాల్సి ఉంది.

రికవరీపై ఉన్నతాధికారుల అసహనం

గిరిజన సంక్షేమ శాఖ ద్వారా అందించిన సాధారణ రుణాలతో పాటు ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ పథకం కింద అందించిన రుణాల రికవరీపై ఉమ్మడి కర్నూలు జిల్లాలో పురోగతి చాలా తక్కువగా ఉందని ఆ శాఖ ఉన్నతాధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రికవరీ చేసేందుకు అధికారులు ప్రయత్నం చేయగా, ఈ పథకానికి సంబంధించిన ఫైల్ మాయమైనట్లు గుర్తించారు. పథకం ద్వారా రుణాలు అందించే క్రమంలో లబ్ధిదారునికి ఒక ప్రభుత్వ ఉద్యోగి తన శాలరీ సర్టిఫికెట్‌ను అందించి షూరిటీ సంతకం చేయాల్సి ఉంది. రుణాలు తీసుకున్న లబ్ధిదారులు రుణాలను సకాలంలో చెల్లించని పక్షంలో వారికి షూరిటీ ఇచ్చిన ప్రభుత్వ ఉద్యోగి జీతం నుంచి రికవరీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే పథకం కింద లబ్ధిపొందిన వారికి ఎవరు అప్పట్లో షూరిటీ ఇచ్చారో తెలుసుకునేందుకు వీలు లేకుండా ఫైల్‌ను మాయం చేసినట్లు తెలుస్తోంది. అతి ముఖ్యమైన ఫైల్ కనిపించకపోవడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

గడువులోగా అర్జీలకు పరిష్కారం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు డీఆర్వో సి. వెంకట నారాయణమ్మ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ.. రీఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి సరైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. సీఎంఓ గ్రీవెన్స్‌లకు సంబంధించి కర్నూలు ఆర్డీఓ దగ్గర 23, ఆదోని సబ్ కలెక్టర్ దగ్గర 23, పత్తికొండ ఆర్డీఓ దగ్గర 7, సర్వే ఏడీ దగ్గర 2 వ్యవసాయ, డీఆర్‌డీఏ, డ్వామా పీడీల దగ్గర ఒక్కో అర్జీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని గడువులోపు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి కౌలు రైతులను గుర్తించాలన్నారు. జిల్లాకు 25 వేల సీసీఆర్‌సీ కార్డులను ఇప్పించేలా లక్ష్యం నిర్దేశించారన్నారు.హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెన్షనర్ల కోసం 15న గ్రీవెన్స్

కర్నూలు(అగ్రికల్చర్): పెన్షనర్ల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 15న జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు డివిజన్ సబ్ ట్రెజరీ, గూడూరు సబ్ ట్రెజరీల నుంచి పెన్షన్ తీసుకునే రిటైర్డు ఉద్యోగులు తమ సమస్యలు రాతపూర్వకంగా ఇస్తే విచారణ జరిపి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



మృత్యుంజయ హోమం క్రతువులో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

వైభవంగా పట్టాభిషేక మహోత్సవం

- లోక కల్యాణార్థం హోమాలు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాన్ని స్వామిజీ సుబుధేంద్రతీర్థులు అధిరోహించి 13 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సోమవారం పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామిజీ పూజా మందిరంలో రాములోరి సంస్థాన పూజలో తరించారు. పట్టాభిషేక దినాన్ని పురస్కరించుకుని యాగశాలలో మృత్యుంజయ, ఆయుష్షు, మార్కండేయ హోమాలు చేపట్టారు. వాస్తు పూజతోపాటు హోమాల పూజల్లో పీఠాధిపతి పాల్గొన్నారు. భారత్, పాకిస్తాన్ దేశాల సరిహద్దుల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో లోక కళ్యాణార్థం హోమాలు చేసినట్లు స్వామిజీ తెలిపారు. భారత్ సైనికులు సురక్షితంగా ఉండాలని, విజయం వరించాలని కోరారు.

'సీజనల్' అక్రమాలు

- సీజనల్ హాస్టళ్ల నిర్వహణ అస్తవ్యస్తం
- బ్లాక్ లిస్టులో నాలుగు స్వచ్ఛంద సంస్థలు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తగ్గకుండా నిర్వహిస్తున్న సీజనల్ హాస్టళ్లలో అక్రమాలు ఉన్నట్లు సమగ్ర శిక్ష అధికారుల విచారణలో తేలింది. దీంతో నాలుగు స్వచ్ఛంద సంస్థలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. స్వయం సహాయక సంఘాలు, విలేజ్ వెల్ఫేర్ అసిస్టెంట్స్ నిర్వహించిన హాస్టళ్లలో దొంగ హాజరు నమోదు చేసినట్లు తెలిసింది. విలేజ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు ముగ్గురిని సైతం బ్లాక్ లిస్టులో చేర్చారు. వీరి బిల్లులో 50 శాతం బిల్లులు కోత విధించారు. అదే విధంగా 9 ఎస్‌హెచ్‌జీలకు 15 నుంచి 50 శాతం వరకు బిల్లులో కోత చేశారు.

హాస్టళ్ల ఏర్పాట్లు ఇలా..

జిల్లా పశ్చిమ ప్రాంతంలో కరువు ఏర్పడి 2024 సెప్టెంబర్ నుంచి వందలాది కుటుంబాలు జీవనోపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నాయి. తమ వెంట విద్యార్థులను తీసుకెళ్తుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం తగ్గుతోంది. ఈ నేపథ్యంలో సమగ్ర శిక్షతో ఆయా ప్రాంతాల్లో 35 సీజనల్ హస్టల్స్ నిర్వహణకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇందులో కప్పట్రాళ్ల మినహా మిగిలిన 34 చోట్ల సీజనల్ హాస్టల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతలు స్వచ్ఛంద సంస్థలకు, స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. గతేడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది మార్చి వరకు వీటిని నిర్వహించారు. అయితే వీటి నిర్వహణపై అనేక ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. దీంతో సమగ్ర శిక్ష అధికారులు ఎంఈఓలు, సీనియర్ హెచ్ఎంలతో కమిటీలు వేసి విచారణ చేయించారు.

విచారణలో వెలుగు చూసిన అంశాలు ఇవే..

- సీజనల్ హాస్టళ్లలో ఏజెన్సీల ఎంపికకు ఎస్ఎస్ఏ అధికారులు ఇద్దరు ఒక్కో ఎన్జీఓ నుంచి రూ.10 వేలు, ఆయా మండలాల ఆఫీస్‌ల్లో రూ.5 వేల చొప్పున వసూళ్లు చేశారనే ఆరోపణలు ఉన్నాయి.
- డీఆర్‌డీఓ ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాలను అధికార పార్టీకి చెందిన వాళ్లకు అప్పగించినట్లు తెలుస్తోంది.
- ఒక్కో హాస్టల్‌కు 50 మంది విద్యార్థులను కేటాయించారు. విద్యార్థులను చూసుకునేందుకు ఒక కేర్ టేకర్, ఓ టీచర్, ఇద్దరు కుక్స్‌ను ఏర్పాటు చేయాలి. కేర్ టేకర్, టీచర్‌కు రూ.10 వేలు, కుక్స్‌కు రూ.5 వేల చొప్పున మంజూరు చేస్తారు.
- సీజనల్ హాస్టల్స్ నిర్వహణలో విద్యార్థుల హాజరు నమోదులో తేడాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. నిర్వహణ బాధ్యతలు చూసే వారికి నోటీసులు ఇచ్చిన వారి వివరణ తీసుకున్నారు. నాలుగు ఏజేన్సీలను బ్లాక్ లిస్టులు పెట్టాలని, 11 ఎస్‌హెచ్‌జీల బిల్లులో 20 నుంచి 50 శాతం వరకు కోత విధించాలని నివేదిక ఇచ్చారు.
- రాగ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ, రూరల్ యాక్టివిటీస్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, సుకన్య విలేజ్ ఆర్గనేజేషన్, సుకన్య విలేజ్ ఆర్గనైజేషన్ అనే స్వచ్ఛంద సంస్థలను బ్లాక్ లిస్టులో పెట్టారు. వీటితో పాటు విలేజ్ వెల్ఫేర్ అసిస్టెంట్లు ముగ్గురిని సైతం బ్లాక్ లిస్టులో చేర్చి, వీరి బిల్లులో 50 శాతం బిల్లులు కోత విధించారు. అలాగే 9 ఎస్‌హెచ్‌జీలకు 15 నుంచి 50 శాతం వరకు బిల్లులో కోత విధించారు.
- స్వయం సహాయక సంఘాలు, విలేజ్ వెల్ఫేర్ అసిస్టెంట్స్ నిర్వహించిన హాస్టళ్లలో దొంగ హాజరు నమోదు చేసినట్లు విచారణలో వెల్లడైంది.

అక్రమాలు వాస్తవమే

జిల్లాలో 34 సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేశాం. ఒక్కో హాస్టల్‌లో 50 మంది విద్యార్థులకు వసతితో పాటు ఉదయం టిఫిన్, రాత్రి భోజనం పెట్టాలి. ఒక్కో విద్యార్థికి వెయ్యి ప్రకారం డైట్ చార్జీలు చెల్లించేటట్లు హాస్టళ్లను ఎన్జీవోలకు, ఎస్‌హెచ్‌జీలకు, విలేజ్ వెల్ఫేర్ అసిస్టెంట్లకు అప్పగించాం. నిర్వహణలో అక్రమాలు జరిగిన మాట వాస్తవమే. నాలుగు ఎన్జీవోలను బ్లాక్ లిస్టులో చేర్చాం. మరి కొన్నింటికి 15 నుంచి 50 శాతం వరకు బిల్లులో కోత విధించాం.
– ఎస్.శ్యామూల్ పాల్, డీఈఓ, సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్

పల్లెకు రాని 'వెలుగు'

- ఆర్టీసీ బస్సుల్లేక గ్రామీణ ప్రజల అవస్థలు
- ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణం
- తరచూ ప్రమాదాలు





ఆటోలోనే నిత్యం ఇలా ప్రజల ప్రయాణం, ప్రమాదకరంగా విద్యార్థులు పాఠశాలకు వెళ్తున్న దృశ్యం (ఫైల్)

కృష్ణగిరి: గ్రామీణ ప్రాంతాలకు 'పల్లె వెలుగు' బస్సులు వెళ్లడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధిలేని పరిస్థితుల్లో ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తోంది. పత్తికొండ నియోజకవర్గంలోని ఐదు మండలాలు ఉండగా.. మొత్తం 106 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. కేవలం 65 గ్రామాలకు మాత్రమే రోజుకు ఒకటి, రెండు ట్రిప్పుల చొప్పున బస్సులు నడుస్తున్నాయి. ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించడానికి ద్విచక్ర, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తూ ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇదీ దుస్థితి..

- గతంలో డోన్ నుంచి కంబాలపాడు, వెల్దుర్తి, కోడుమూరు నుంచి పలు బస్సు సర్వీసులు కృష్ణగిరికి ఉండేవి. నేడు కర్నూలు జిల్లాలో బస్సు సౌకర్యం లేని మండల కేంద్రంగా కృష్ణగిరి నిలిచింది. ప్రజలకు ఆటోలే శరణ్యమయ్యాయి.
- పత్తికొండ నియోజవర్గంలోని దాదాపుగా అన్ని గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు సౌకర్యాలు లేవు.
- రామకృష్ణాపురం, ఎస్‌హెచ్ ఎర్రగుడి, మన్నెకుంట, జి.మల్లాపురం, ఎరుకల చెరువు, పోతుగల్లు, పెనుమాడ, కంబాలపాడు, అమకతాడు, కర్లకుంట, తొగర్చేడు, టి.గోకులపాడు, బోయబొంతిరాళ్ల, ఆలంకొండ, కటారుకొండ, పెద్దొడ్డి, గుడెంపాడు, బాపనదొడ్డి, పుట్లూరు తదితర గ్రామాలకు చెందిన రెండు వేల మంది ప్రజలు డోన్, వెల్దుర్తి, కోడుమూరు ప్రాంతాలకు వెళ్లడానికి ఆటోలను ఆశ్రయిస్తున్నారు.
- వెల్దుర్తి మండలంలోని చిన్న కులుములపల్లె, శ్రీరంగాపురం, లక్ష్మింపల్లె, చెర్లకొత్తూరు. గోవర్ధనగిరి, కొట్టాల, పేరేముల, ఎల్.నగరం, బింగిదొడ్డి, ఎల్ తాండ, కాశాపురం, సూదాపల్లె, బోగోలు, గువ్వలకుంట, గుంటుపల్లి, అల్లుగుండు, మల్లెపల్లె, నార్లాపురం, వెంకటాపురం, బుక్కాపురం, బోయినపల్లె, సర్పాపురం, తిమ్మాపురం, పిక్కిలివానిపల్లె, బాలాపురం, లింగాలపల్లె, కొసనాపల్లె, మంగంపల్లె గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.
- తుగ్గలి మండలంలో 37, మద్దికెర మండలంలో 6 గ్రామాలకు, పత్తికొండ మండలంలో కూడా పుచ్చకాయలమాడ, అటికెలగుండు, కొత్తపల్లి, చక్రాళ్ల, కురవలదొడ్డి, పెద్దహుల్తి, కోతిరాళ్ల, నలకదొడ్డి గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు.

ప్రయాణం.. ప్రమాదకరం

బస్సులు లేని కారణంగా భద్రతలేని ఆటోల్లో ప్రయాణించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏడాది కాలంలో పత్తికొండ నియోజకవర్గంలో చాలా మంది ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆటోల్లో, ద్విచక్ర వాహనాల్లో ప్రయాణిస్తూ ప్రమాదానికి గురై 20 మంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది క్షతగాత్రులయ్యారు. ఆటో ప్రయాణం ప్రమాదమని తెలిసినా విధిలేని పరిస్థితుల్లో వాటిపైనే ఆధారపడాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పాఠశాలలకు విద్యార్థులు సైతం ఆటోల్లోనే వెళ్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబాల్లో విషాదం నెలకొననుంది.

బస్సులు వెళ్లని గ్రామాల సంఖ్య..

మండలం	బస్సు వెళ్లని గ్రామాలు
కృష్ణగిరి	28
వెల్దుర్తి	27
తుగ్గలి	37
పత్తికొండ	8
మద్దికెర	6

నడిచి వెళ్లాలి



మా గ్రామానికి అసలు బస్సు సౌకర్యమే లేదు. మా గ్రామస్తులు ఎక్కడికైనా నడిచి వెళ్లాల్సి వస్తోంది. హంద్రీ నది దాటి గోరంట్ల గ్రామానికి వెళ్తున్నారు. అక్కడి నుంచి వెల్దుర్తి, కోడుమూరు, కర్నూలుకు బస్సులు ఉన్నాయి. వర్షాలు వచ్చి హంద్రీ నది వస్తే బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. – కృష్ణయ్య, ఎస్‌హెచ్ ఎర్రగుడి

ఒక్క బస్సు లేదు



గతంలో డోన్ నుంచి ఓబులాపురం మీదుగా మా గ్రామం నుంచి కోడుమూరుకు ప్రతి రోజూ ఐదు సార్లు బస్సులు తిరిగేవి. ఇప్పుడు ఒక్క బస్సు సౌకర్యం లేదు. డోన్‌కు రావాలన్నా, మండల కేంద్రమైన కృష్ణగిరి వెళ్లాలన్నా ఆటోలు దిక్కు అవుతున్నాయి. బస్సు సౌకర్యం కల్పిస్తే బాగుంటుంది. – రామచంద్రుడు, కటారుకొండ

చర్యలు తీసుకుంటాం

డోన్ బస్సు డిపో పరిధిలోని వెల్దుర్తి, కృష్ణగిరి మండల్లాలోని పలు గ్రామాలకు గతంలో బస్సులు తిరిగేవి. కానీ ఆ దారుల్లో ఆటోలు ఎక్కువ కావడంతో బస్సు సర్వీసులు నిలిపివేశారు. ఇప్పుడు మరో మారు ఆ దారుల్లో అవసరాన్ని బట్టి బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటాం.
– శశిభూషణ్, ఆర్టీసీ డీఎం, డోన్

క్లుప్తంగా

చాగలమర్రిలో చోరీ



వస్తువులు చెల్లాచెదురుగా పడేసిన దృశ్యం

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని గుంతపాళెం వీధిలో నివాసం ఉంటున్న హబీబ్ అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. రూ.3 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలతో పాటు రూ.60 వేల నగదును గుర్తు తెలియని దుండగులు అపహరించారు. గౌండా పని చేసే హబీబుల్లా పని నిమిత్తం కమలాపురం వెళ్లాడు. కాగా అతని భార్య ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న ఆమె తల్లిదండ్రుల ఇంట్లో పిల్లలతో నిద్రించింది. అయితే ఇంటికి తాళం వేసిన విషయాన్ని పసిగట్టిన దొంగలు తాళాలు పగులగొట్టి బీరువాలో ఉన్న నగదు, బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. సోమవారం ఉదయం చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు క్లూస్ టీమ్‌తో చేరుకుని దొంగల వేలి ముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

ఆటోలో నుంచి జారి పడి యువకుడి దుర్మరణం

వెలుగోడు: ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారి పడి ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన అబ్దుల్లాపురం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రేగడగూడూరు గ్రామానికి చెందిన షాబోలు శేఖర్ కుమారుడు వంశీ(20) సోమవారం నంద్యాలకు వెళ్లేందుకు ఆటో వెనుక కూర్చున్నాడు. మార్గమధ్యలో అబ్దుల్లాపురం సమీపంలో పట్టు జారి ఆటోలో నుంచి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. శేఖర్‌కు ఇద్దరు కుమారులు కాగా వంశీ నంద్యాల ఆల్కోహాలిస్ ఫ్యాక్టరీలో పని చేసేవాడు. చేతికొచ్చిన కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శేషావలి తెలిపారు.

మార్కెట్ కమిటీలకు రూ.40.40 కోట్ల లక్ష్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలకు 2025–26లో ఫీజు వసూలు లక్ష్యాలు ఖరారయ్యాయి. జిల్లాలో ఏడు మార్కెట్ కమిటీలు ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై ఒక శాతం ఫీజు ప్రకారం రూ.40.40 కోట్లు వసూలు చేసే లక్ష్యాలను ఇచ్చారు. కర్నూలు రూ.8.70 కోట్లు, ఆదోని రూ.18 కోట్లు, ఎమ్మిగనూరు రూ.8.50 కోట్లు, ఆలూరు రూ.1.10 కోట్లు, పత్తికొండ రూ.95 లక్షలు, కోడుమూరు రూ.1.80 కోట్లు, మంత్రాలయం మార్కెట్ కమిటీ రూ.1.35 కోట్ల ప్రకారం ఫీజు వసూలు చేసే విధంగా లక్ష్యాలను ఇచ్చినట్లు జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నారాయణ మూర్తి తెలిపారు.

సబ్సిడీ తగ్గి.. ధర పెరిగి!

- వేరుశనగ రైతును ఆదుకోని రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాకు అవసరం 32,471 క్వింటాళ్లు
- కేటాయింపు 11,108 క్వింటాళ్లు మాత్రమే
- మార్కెట్‌లో ధర రూ.6,500 అయితే.. ప్రభుత్వం ధర రూ.9,300



కర్నూలు(అగ్రికల్చర్): ఖరీఫ్ సీజన్‌కు కూటమి ప్రభుత్వం ఆరకొరగా వేరుశనగ విత్తనాలు కేటాయించింది. వీటికి బహిరంగ మార్కెట్ కంటే ఎక్కువగా ధర ఉండటం తీవ్ర విమర్శలకు దారి తీసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లు ఖరీఫ్‌లో వేరుశనగ విత్తనం కాయలను 35 శాతం సబ్సిడీపై పంపిణీ చేసింది. కూటమి ప్రభుత్వం మాత్రం 25 శాతం సబ్సిడీతో పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80 వేల హెక్టార్లలో వేరుశనగ పంటశసాగు చేస్తారు. మొత్తం 32,181 క్వింటాళ్ల విత్తనం కాయలు అవసరమని మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏలు నివేదించారు. కానీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు అంతంత మాత్రంగా 11,108 క్వింటాళ్లు మాత్రమే కేటాయించింది. వేరుశనగ పూర్తి ధర నిర్ణయించినప్పటికీ సబ్సిడీ ప్రకటించలేదు. గత ఏడాది 25 శాతం మాత్రమే సబ్సిడీ ఇచ్చింది. ఈ సారి కూడా 25 శాతం వరకే సబ్సిడీ ఇచ్చే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కర్నూలు జిల్లాలో ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, చిప్పగిరి, దేవనకొండ, హాలహర్వి, పెద్దకడుబూరు, కల్లూరు, కృష్ణగిరి, వెల్దుర్తి, కర్నూలు, ఓర్వకల్లు, ఆదోని, కొసిగి, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నంద్యాల జిల్లాలో డోన్, ప్యాపిలి, బేతంచెర్ల, నందికొట్కూరు మండలాల్లో సాగు చేస్తారు.

కేటాయింపులు నామమాత్రం

గత ఏడాది ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో 13,804, నంద్యాల జిల్లాలో 3,063 క్వింటాళ్ల వేరుశనగ విత్తనం కాయలు పంపిణీ అయ్యాయి. ప్రస్తుతం కర్నూలు జిల్లాకు 9,099, నంద్యాల జిల్లాకు 2,009 క్వింటాళ్ల ప్రకారం కేటాయించింది. వేరుశనగ సాగు కర్నూలు జిల్లాలో 55 వేల హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 30 వేల హెక్టార్ల వరకు సాగవుతంది. కర్నూలు జిల్లాకు 18,310, నంద్యాల జిల్లాకు 14,181 ప్రకారం 32,491 క్వింటాళ్లు అవసరమని జిల్లా వ్యవసాయ యంత్రాంగం నివేదించింది. ఈ ప్రకారం కేటాయించకపోయినా.. గత ఏడాది మేరకు కేటాయించాలి. కాని తూతూ మంత్రంగా కేటాయించడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. మార్కెట్‌లో వేరుశనగ క్వింటాకు రూ.6,500 వరకు ధర ఉంది. ప్రభుత్వం మాత్రం రైతులకు పంపిణీ చేసే వేరుశనగ ధర రూ.9,300గా నిర్ణయించింది. దళారులకు మేలు చేసే విధంగా ధర నిర్ణయించిందనే విమర్శలు ఉన్నాయి.

నాణ్యత ప్రశ్నార్థకమే!

ఉమ్మడి జిల్లాకు అవసరమైన వేరుశనగను ఆంధ్ర ప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ(ఏపీసీడ్స్) సరఫరా చేస్తోంది. వేరుశనగ విత్తనోత్పత్తి లేకపోవడంతో దళారులే ఆధార మయ్యారు. గత ఏడాది పంపిణీ చేసిన వేరుశనగ నాణ్యతపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. విత్తనం కాయల ప్యాకెట్లలో రాళ్లు, మట్టి పెళ్లలు, చెత్త చెదారం ఉండటం, విత్తనం నాసిరకంగా ఉండటం పట్ల రైతులు ఆందోళనకు గురయ్యారు. వేరుశనగ నాణ్యత బాగాలేదని వ్యవసాయ అధికారులు కూడా వెనక్కి పంపించారు. ఈ సారైన వేరుశనగ విత్తనం కాయల్లో నాణ్యత ఉంటుందా అదే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. వేరుశనగ కోసం దళారులపై ఆధారపడుతుండటంతోనాణ్యత కొండెక్కుతోందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

కేటాయింపులు ఇలా...

కర్నూలు జిల్లాకు 9,099 క్వింటాళ్లు కేటయించగా.. సాగు విస్తీర్ణాన్ని బట్టి సబ్ డివిజన్‌లు, మండలాలకు జిల్లా వ్యవసాయ కేటాయించింది. కర్నూలు సబ్ డివిజన్‌కు 495, ఆదోని సబ్‌డివిజన్‌కు 1,182, ఎమ్మిగనూరు సబ్‌డివిజన్‌కు 320, ఆలూరు సబ్ డివిజన్‌కు 1017, పత్తికొండ సబ్ డివిజన్‌కు 6,085 క్వింటాళ్ల ప్రకారం కేటాయించారు. నంద్యాల జిల్లాకు కేటాయించిన 2,009 క్వింటాళ్ల విత్తనాలను ప్యాపిలి, డోన్, బేతంచెర్ల, నందికొట్కూరు, కోవెలకుంట్ల తదితర మండలాలకు కేటయించారు.

శేషవాహనంపై విహరించిన పాండురంగడు



శేషవాహనంపై దర్శనమిస్తున్న పాండురంగడు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో ఆరవ రోజు ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యులు పంచామృతాభిషేకం, మహాగణపతి పూజ, స్త్రీసూక్త, భూసూక్త విధానేన అభిషేకాలు, సంప్రోక్షణ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి పాండురంగడు శేష వాహనంపై కొలువుదీరగా పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన భక్తులు ఆలయాన్ని చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం నుంచి గాంధీ సెంటర్ వరకు గ్రామోత్సవం కొనసాగింది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పాండురంగ విఠలేశ్వరుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

ప్రాథమిక పాఠశాల విద్య ఇక నిర్వీర్యం



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

- ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని మార్చుకోవాలి
- డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల ధర్నా

కర్నూలు సిటీ: పాఠశాలల పునఃవ్యవస్థీకరణ ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రాథమిక విద్యను ఇక నిర్వీర్యం చేస్తుందని ఉపాధ్యాయులు ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. పాఠశాల పునఃవ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కర్నూలులోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఆ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉల్చాల రవి కుమార్, నవీన్ పాటి, జిల్లా ఉపాధ్యక్షులు హేమంత్ కుమార్ మాట్లాడారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం విస్మరించారని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే జీఓ 117 రద్దు చేసి, పాత విధానాన్నే తీసుకొస్తామని హామీనిచ్చిన విషయం మర్చిపోయారన్నారు. పాఠశాలల పునఃవ్యవస్థీకరణ గందరగోళంగా మారిందన్నారు. వేసవి సెలవుల్లోనే బదిలీలు, పదోన్నతులు పూర్తి చేసి, డీఎస్సీ నియామకాలను పూర్తి చేయాలని కోరారు. ఎస్‌జీటీలకు మ్యానువల్‌గానే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని, పదోన్నతుల్లో సీనియారిటీకి సంబంధించిన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే అన్ని సంఘాలతో కలిసి పెద్ద ఉద్యమాలు చేపడతామన్నారు. అనంతరం డీఈఓ శామ్యూల్ పాల్‌కి వినతి పత్రం అందజేశారు. ధర్నాలో ఆ సంఘం నాయకులు జయరాజు, హనుమంతు, యేహోషువా, కౌలన్న, భాస్కర్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఇనుప కడ్డీలు



గొల్ల పవన్ (ఫైల్)

మంత్రాలయం రూరల్: ఇనుప కడ్డీలు మీద పడి వెల్డింగ్ కార్మికుడు గొల్ల పవన్(25) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శివాంజల్ తెలిపిన వివరాలు ఇవి.. నందవరం మండలం నదికైరవాడి గ్రామానికి చెందిన గొల్ల పవన్ మంత్రాలయంలో వెల్డింగ్ పని చేస్తున్నాడు. సోమవారం పనుల నిమిత్తం ఎమ్మిగనూరుకి వెళ్లి ఆటోలో ఇనుప కడ్డీలు తీసుకు వచ్చాడు. మంత్రాలయంలోని పరిమళ లాడ్జ్ సమీపంలో ఆటో టైర్ బురదలో కూరుకుపోయింది. అక్కడ ఉన్న కొంత మందితో ఆటోను బురదలోంచి పైకి ఎత్తడంతో ముందుకెళ్లి బోల్తా పడింది. వెనుక భాగంలో ఉన్న గొల్ల పవన్‌పై ఆటోపై ఉన్న ఇనుప కడ్డీలు మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గొల్ల పవన్‌కు భార్య గొల్ల పవిత్ర, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

కౌతాళంలో ప్రసాదం పంపిణీ



మట్టి పాత్రల్లో ప్రసాదం ఇస్తున్న దృశ్యం

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి ఉరుసులో భాగంగా సోమవారం కౌతాళంలో సఫ్‌రాలుటన (ప్రసాదం పంపిణీ) కార్యక్రమం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ ఇంట్లో మట్టి కుండల్లో ప్రత్యేకంగా తయారు చేసిన తీపి పదర్థాన్ని డప్పువాయిద్యాల మధ్య దర్గాకు తీసుకొచ్చారు. ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనల అనంతరం ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ ప్రసాదాన్ని ముగ్గురు భక్తులకు పంపిణీ చేశారు. ఈ ప్రసాదం పొలంలో పాతితే పంట బాగా పండుతుందని, రోగం ఉన్నవారు తింటే వారికి రోగం తగ్గుతుందని భక్తుల నమ్మకం. దీంతో ఈ ప్రసాదం కోసం పోటీ పడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ అశోక్‌కుమార్ పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

ఆళ్లగడ్డ: అహోబిలం దేవస్థానం సమీపంలోని నల్లమల అడవిలో సోమవారం ఓ ప్రేమ జంట ఆత్మహత్యకు యత్నించింది. ఎగువ అహోబిలం వెళ్లే రహదారిలోని బోరింగ్ బేస్‌క్యాంపు సమీపంలోని టేకు ప్లాట్‌లో యువతి, యువకుడు పురుగు మందు తాగారు. అనంతరం యువకుడు దాహం వేసి నీళ్ల కోసం సమీపంలోని బేస్‌క్యాంపు దగ్గరకు వెళ్లాడు. అయితే అటవీ సిబ్బందికి అనుమానం వచ్చి యువకుడి వెంట వెళ్లగా టేకు ప్లాట్‌లో యువతి అపస్మారక స్థితిలో పడి ఉంది. యువకుడిని నిలదీయడంతో తాము ఇద్దరం ప్రేమికులమని, పెళ్లికి పెద్దలు ఒప్పుకోక పోవడంతో పురుగు మందు తాగినట్లు చెప్పాడు. దీంతో అటవీ సిబ్బంది వారిని అహోబిలం ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స తర్వాత 108లో ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. యువకుడి రుద్రవరం మండలం, యువతి ఆళ్లగడ్డ మండలానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

మాజీ మంత్రి రజినీపై పోలీసుల తీరు దారుణం



నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నేతలు, కార్యకర్తలు

- వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన

కర్నూలు(టౌన్): చిలకలూరి పేటలో మాజీ మంత్రి విడదల రజినీపై పోలీసులు వ్యవహరించిన తీరును దారుణంగా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా జోనల్ అధ్యక్షురాలు గాజుల శ్వేతారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి కల్లా నాగవేణి రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ అన్నారు. కర్నూలులోని వైఎస్సార్ సర్కిల్ వద్ద మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం పార్టీ మహిళా నేతలు, కార్యకర్తలు నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకొనినిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలపై అకృత్యాలు జరుగుతున్నా కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. మహిళలపై అమానీయంగా వ్యవహరిస్తున్న పోలీసు శాఖపై చర్యలు తీసుకోవడంలో సాటి మహిళా హోంమంత్రి అనిత ఘోరంగా విఫలం చెందారన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు కల్పనపై రాత్రికి రాత్రి కేసు పెట్టి పోలీసు స్టేషన్‌కు ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. రౌడీలా వ్యవహరించిన సీఐ సుబ్బరాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకులు భారతి, నగర అధ్యక్షురాలు మంగమ్మ, 4 వ వార్డు కార్పొరేటర్ అర్షియా ఫర్హీన్ పాల్గొన్నారు.

బీఈడీ పరీక్ష ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఫిబ్రవరిలో నిర్వహించిన బీఈడీ స్పెషల్ సప్లిమెంటరీ (2015–19) 1,2,3,4, సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు ఫలితాలు విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. మొదటి సెమిస్టర్‌కు 155 మంది పరీక్ష రాయగా 108, రెండో సెమిస్టర్‌కు 47కు 34, మూడో సెమిస్టర్‌కు 76కు 43, నాలుగో సెమిస్టర్‌కు 72కు 51 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మల్లేశ్వరస్వామి జాతరకు తరలిన భక్తులు



హొళగుంద నుంచి ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం తెక్కలకోట గ్రామ కొండల్లో నిర్వహిస్తున్న మల్లేశ్వరస్వామి జాతరకు హొళగుంద మండలం నుంచి భక్తులు సోమవారం తరలివెళ్లారు. మల్లేశ్వరస్వామిని వాల్మీకులు కొలుస్తారు. ఏటా స్వామి రథోత్సవానికి ముందు బండారం సమర్పించేందుకు భక్తులు డోలు, మేళ తాళాలతో హొళగుంద నుంచి కర్ణాటకకు ఊరేగింపుగా వెళ్లడం ఆనవాయితీ. హొళగుందకు 30 కి.మీ. దూరంలో ఉన్న స్వామి సన్నిధికి చేరుకునేందుకు సోమవారం చెప్పులు లేకుండా కాలినడకతో బయలుదేరారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో 52 పరీక్షలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం జరిగిన ఫస్ట్ ఇయర్ పరీక్షలకు 3,842 మంది విద్యార్థులకుగాను 3,660 మంది హాజరు కాగా 182 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకండ్ ఇయర్ పరీక్షలకు 660 మంది విద్యార్థులకు గాను 601 మంది హాజరు కాగా 59 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐఓ గురవయ్య శెట్టితో పాటు డీఈసీ మెంబర్లు, కస్టోడియన్స్, స్క్వాడ్ బృందాలు మొత్తం 30 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

19 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పరీక్షలకు జిల్లాలో 69 కేంద్రాలను ఎంపిక చేసినట్లు డీఈఓ ఎస్.శ్యామూల్ పాల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 18 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్స్‌ను వాట్సాప్ మన మిత్ర(వాట్సాప్ గవర్నెన్స్)నుంచి 9552300009కు హాయ్ అని పంపి విద్యా సేవలను ఎంచుకుని డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని సూచించారు.

ఆర్టీసీ బస్సులో ఆభరణాల అపహరణ

ఆదోని అర్బన్: ఆర్టీసీ బస్సులో సోమవారం సాయంత్రం చోరీ జరిగింది. ఆదోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సు స్వప్న నంద్యాలకు వెళ్లేందుకు ఆదోని బస్టాండ్‌లో బస్సు ఎక్కారు. హ్యాండ్ బ్యాగులో నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రూ.30 వేలు నగదును పెట్టుకుని ఉన్నారు. సీటులో పక్కనే ఉన్న మహిళకు హ్యాండ్ బ్యాగు ఇచ్చి లగేజీ తేవడానికి కిందకు వెళ్లారు. లగేజీ తీసుకుని వచ్చేలోపు హ్యాండ్ బ్యాగు తెరిచి ఉంది. సెల్‌ఫోన్ తీసుకోవడానికి చూస్తే అందులో బంగారు ఆభరణాలు, నగదు లేకపోవడంతో హ్యాండ్ బ్యాగ్‌ను చూస్తున్న మహిళను అడగగా తనకు తెలియని చెప్పారు. దొంగ ఎవరో తెలియక బస్సును ఆపి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని బాధిత మహిళ ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలు పరిశీలించామని, విచారణ చేపడతామని టూటౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

బనగానపల్లె ఏపీఎం సస్పెన్షన్

బనగానపల్లె రూరల్: స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న అడ్డాకుల శ్రీనివాసులను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఆయన స్థానంలో అవుకు ఏపీఎం చంద్రశేఖర్‌కు అధికారులు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. మహిళా వీఓఏల పట్ల శ్రీనివాసులు అసభ్యంగా ప్రవరిస్తున్నట్లు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. విచారణ అనంతరం ఏపీఎం శ్రీనివాసులను ఈ నెల 9వ తేదీన సస్పెన్షన్ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎంపీడీఓ వెంకటరమణను వివరణ కోరగా తనకు సమాచారం రాలేదన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని భోజనం గ్రామానికి చెందిన వృద్ధుడు చాకలి రాముడు (70) సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న రాముడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు. చాకలి రాముడికి భార్య సుంకమ్మ, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆత్మహత్యకు ఎందుకు పాల్పడ్డారో పూర్తి వివరాలు రాలేదని ఎస్ఐ జగన మోహన్ తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థులకు తప్పిన ముప్పు

- రైల్వే గేటును ఢీకొని పట్టాలపైకి చేరుకున్న కారు
- గేట్‌మన్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి గురైన కారు

మహానంది: గాజులపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే క్రాసింగ్ గేటు వద్ద సోమవారం తెల్లవారుజామున భారీ ప్రమాదం తప్పింది. రైల్వే ఏఎస్ఐ హనుమంత రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మహానంది వ్యవసాయ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులు కర్నూలు నుంచి కళాశాలకు వస్తున్నారు. అదే సమయంలో తిరుపతి నుంచి గుంటూరు వెళ్లే రైలు వస్తుండటంతో గాజులపల్లి రైల్వే స్టేషన్ వద్ద గేటు మూశారు. అయితే కారు వేగంగా రావడంతో అదుపుతప్పి రైల్వే గేటును ఢీకొని పట్టాల పైకి వచ్చి ఆగింది. వెంటనే గేట్‌మెన్ అప్రమత్తతతో దూరంగా వస్తున్న రైలు ఆగి పోయింది. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఇదిలా ఉండగా రైల్వే గేటు దెబ్బ తినడంతో మరమ్మతులు చేపట్టారు. కాగా దాదాపు మూడు గంటల మేర మహానంది, గాజులపల్లి నుంచి మహానందికి వెళ్లే వాహనాలు వందల సంఖ్యలో ఆగిపోగా ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇద్దరు విద్యార్థుల డిబార్

కర్నూలు కల్చరల్: డిగ్రీ, బీఈడీ సెమిస్టర్ పరీక్షల్లో చూచిరాతలకు పాల్పడుతూ ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని రాయలసీమ వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్సిటీ పరిధిలో 59 కేంద్రాల్లో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం జరిగిన 4వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 8,537 మందికి 7,773 మంది హాజరు కాగా 764 మంది గైర్హాజరయ్యారు. కర్నూలు డిగ్రీ కళాశాల కేంద్రంలో రవీంద్ర ఉమెన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థి ఒకరు చూచిరాత పాల్పడగా గుర్తించి డిబార్ చేశామన్నారు. అలాగే బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలకు 4,015 మందికి 3,697 మంది హాజరు కాగా 318 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. డోన్ జీవీఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రంలో శ్రీ సాయి సుధా కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ విద్యార్థి ఒకరు చూచిరాతకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

కొబ్బరి బోండాం కొనలేం!



పత్తికొండ రూరల్: కొబ్బరి బోండాం ధర భారీగా పెరిగింది. నిన్నమొన్నటి వరకు ధర రూ.50 ఉండగా.. నేడు రూ.70కి చేరింది. మైదాన ప్రాంతాల నుంచి లారీల్లో వచ్చిన కొబ్బరి బోండాలను ఉమ్మడి కర్నూలు జిల్లాలో విక్రయిస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో డీహైడ్రేషన్ నుంచి తప్పించుకునేందుకు కోసం పోషకాలతో కూడిన కొబ్బరి నీళ్లు తాగితే మంచిదని రోగులకు వైద్యులు సూచిస్తున్నారు. ఒకే సారి ధర రూ.20 పెరగడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.